AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

హైదరాబాద్‌లో ఐటీ సోదాలు

అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఆదాయపన్ను శాఖ తనిఖీలు చేపట్టింది. ఏకకాలంలో 15 చోట్ల ఆ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రముఖ హోటళ్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల నివాసాల్లో సోదాలు జరిపి పలు పత్రాలు పరిశీలించారు. పిస్తా హౌస్, షా గౌస్, మెహిఫిల్ హోటళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ హోటళ్లు ఏటా వందలకోట్ల వ్యాపారం చేస్తున్నాయి. పిస్తా హౌస్, షా గౌస్ హోటళ్లు ఇతర నగరాల్లోనూ నడుస్తున్నాయి. దుబాయ్‌లోనూ వాటికి బ్రాంచ్‌లు ఉన్నాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వాయిదా



అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సుప్రీం కోర్టులో వాయిదా వేసింది. మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదంటూ, ప్రభాకర్ రావు అరెస్టుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో పిటిషన్ వేసింది. ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కోరింది. ఆయన ఆధారాలను ధ్వంసం చేశారంటూ సుప్రీంలో ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే ప్రభాకర్ రావు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో కేసు విచారణను కోర్టు డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

18-11-2025 (Tuesday) MAIN EDITION

డిసెంబర్ 30 వైకుంఠ ద్వార దర్శనాలు



అక్షరటుడే, తిరుమల: వైకుంఠ ఏకాదశిపై టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

డిసెంబర్ 31న వైకుంఠ ఏకాదశి ఉంది. దీంతో తిరుమలకు భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉంది.

ఈ క్రమంలో డిసెంబర్ 30 నుంచి 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నట్లు టీటీడీ తెలిపింది.

నటి హేమ తల్లి కన్నుమూత

అక్షరటుడే, సినిమాడెస్క్: తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటి హేమ తల్లి మృతి కన్నుమూసింది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం ఆంధ్ర ప్రదేశ్‌లోని అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో తుదిశ్వాస విడిచింది.

జనజీవన స్రవంతిలోకి రండి..

అక్షరటుడే, వేములవాడ: బుల్లెట్ వల్ల ఏ సమస్య పరిష్కారం కాదని, బ్యాలెట్‌తోనే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మావోయిస్టులు ఆయుధాలు వీడి జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.హిడ్మా ఎన్ కౌంటర్ నేపథ్యంలో వేములవాడ లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఢిల్లీలో బాంబు బెదిరింపుల కలకలం

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. పలు కోర్టులు, విద్యాసంస్థల లక్ష్యంగా కొందరు దుండగులు ఈమెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. 4 కోర్టులు, రెండు సీఆర్‌పీఎఫ్ సూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. సాకేత్, రోహిణి, ద్వారక, పాటియాలా కోర్టులకు బెదిరింపులు రావడంతో సిబ్బంది, లాయర్లు బయటకు వచ్చారు. అనంతరం డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ప్రశాంత్ విహార్, ద్వారకలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలల ఆవరణలో పేలుడు పదార్థాలు అమర్చినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులను అధికారులు గుర్తించలేదు. దీంతో ఇవి నకిలీ బెదిరింపులని అధికారులు తేల్చారు.

ఇక వాట్సాప్‌లో 'మీ సేవ' సర్వీసెస్..

అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మీ సేవ అందిస్తున్న సేవలను మరింత సులభతరం చేసింది. మీ సేవ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వాట్సాప్ ద్వారా అందించనుంది. వాట్సాప్ మీసేవ సర్వీసులను బంజారా హిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కుల, ఆదాయ, బర్త్, డెత్, రెసిడెన్స్ వంటి సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా అప్లై చేసుకోవాలి. అలాగే ఈ కేంద్రాల ద్వారా చాలా రకాల సేవలు అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తును వాట్సాప్ ద్వారా చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

తెలంగాణ జల మండలికి పురస్కారం

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ జల మండలికి జల్ సంచయ్ జన భాగిదారి పురస్కారం లభించింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జల మండలి ఎండీ అశోక్ రెడ్డి అవార్డు అందుకున్నారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టాప్ మున్సిపల్ కార్పొరేషన్' కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచినందుకు అవార్డు వచ్చింది. దీంతో నీటి సంరక్షణ కార్యక్రమాల కోసం రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహకం కేంద్రం ఇవ్వనుంది.

హిడ్మా ఎన్‌కౌంటర్

మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్ర నేత, అనేక గెరిల్లా దాడులకు నాయకత్వం వహించిన హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. బలగాలకు దొరకకుండా గత కొంతకాలంగా హిడ్మా తప్పించుకుంటున్నాడు. అతడి కోసం అనేక ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మరణించాడు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా మృతి
- ఏపీలోని అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఆరుగురు నక్సల్స్ హతం
- మృతుల్లో హిడ్మా భార్య రాజే
- మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. మృతుల్లో హిడ్మా భార్య కూడా ఉన్నారు. కాగా హిడ్మాపై రూ.కోటికి పైగా రివార్డు ఉంది.

అనేక సార్లు తప్పించుకొని..

హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువర్తి గ్రామంలో జన్మించాడు. మావోయిస్ట్ ఉద్యమానికి ఆకర్షితుడై అడవి బాట పట్టాడు. అంచెలంచెలుగా కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. బస్తర్ నుంచి కేంద్ర కమిటీ సభ్యుడు అయిన ఏకైక వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. భారీ ఆయుధాలు కలిగిన 350 మంది సభ్యుల బెటాలియన్‌కు ప్రస్తుతం కమాండర్‌గా ఉన్నాడు. ఆయనకు మూడంచెల భద్రత ఉంటుంది. బలగాలకు దొరకకుండా తప్పించుకోవడంలో ఆయన దిట్ట. గతంలో అనేకసార్లు కేంద్ర బలగాలు, పోలీసులు హిడ్మా కోసం కూంబింగ్ చేపట్టినా దొరకలేదు. అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నాడు. తాజాగా ఆయన ఏపీలో ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. ఘటనా స్థలం నుంచి రెండు ఏకే47లు, ఒక రివాల్వర్, పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

25 ఏళ్లుగా అజ్ఞాతంలో

హిడ్మా 25 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. అనేక దాడులకు స్కెచ్ వేశాడు. 26 దాడుల్లో హిడ్మా కీలక నిందితుడిగా ఉన్నాడు. 2007 సుక్మా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి చేసి హతమార్చారు. 2010లో తడ్‌మెట్ల మెరుపు దాడిలో 76 మంది జవాన్లు చనిపోయారు. 2013లో జీరామ్‌ఘాటీ వద్ద కాంగ్రెస్ నేతల ఊచకోత ఘటనలో హిడ్మా కీలక పాత్ర పోషించాడు. 2017 సుక్మా జిల్లాలో 27 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను మావోయిస్టులు హతమార్చారు. 2021 ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా తరెంలో హిడ్మా వ్యూహంలో చిక్కుకుని 23 మంది జవాన్లు చనిపోయారు. దీంతో బలగాలకు ఆయన మోస్ట్ వాంటెడ్ అయిపోయాడు. ఇటీవల బలగాలు హిడ్మా కర్రెగుట్టల్లో ఉన్నాడనే సమాచారంతో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఆయన ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతానికి మకాం మార్చినట్లు సమాచారం. మావోయిస్టు అగ్ర నేతలు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకోగా హిడ్మాతో సహాఆరుగురు మృతి చెందారు.

సంక్షోభంలో మావోయిస్ట్ పార్టీ

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్ట్ పార్టీ కకావికలం అయింది. దేశంలో మార్చి 31 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బలగాలు భారీ విజయాలు సాధిస్తున్నాయి. గతంలో మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో హతమైన విషయం తెలిసిందే. అనంతరం పలువురు కీలక నేతలు సైతం మృతి చెందారు. చాలా మంది అడువలను వీడి లొంగిపోతున్నారు. ఈ క్రమంలో మావోయిస్ట్ ఉద్యమంలో చీలిక రావడంతో కేంద్ర కమిటీ సభ్యులు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న తమ అనుచరులతో ఇటీవల లొంగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఇక మావోయిస్ట్ పార్టీ పని అయిపోయినట్లేనని పలువురు భావిస్తున్నారు.

కృష్ణా జిల్లాలో 27 మంది అరెస్ట్

కృష్ణా జిల్లా పెనమలూరులో మావోయిస్టులు తలదాచుకున్నానే సమాచారం మేరకు ఆక్టోపస్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కొత్త ఆటోనగర్‌లోని ఓ భవనంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. ఆ భవనాన్ని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించాయి. మొత్తం 27 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. అరెస్టయిన మావోయిస్టుల్లో నలుగురు కీలక నేతలు ఉన్నారు. కాగా వారు హిడ్మా అనుచరులుగా అధికారులు భావిస్తున్నారు.

మృతి చెందిన మావోయిస్టులు

హిడ్మా కేంద్ర కమిటీ సభ్యుడు, మడగం రాజే
హిడ్మా భార్య, లక్మల్ DCM, కష్లు PPCM,
మల్లా PPCM, దేవే హిడ్మా గార్డ్

హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. నగరంలోని హోటల్ కోహినూర్‌లో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల ప్రాంతీయ సమావేశంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం అన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రజెంట్ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన సహా అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని చూస్తున్నట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ అనే ఒక సిటీనే త్వరలో నిర్మించడానికి చర్యలు చేపట్టామన్నారు. తమ ప్రణాళికలు అమలు కావాలంటే కేంద్రం సపోర్ట్ అవసరం అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండాలన్నదే తమ ఆలోచన అని సీఎం అన్నారు. ముఖ్యమంత్రులకు ఉన్న ఇబ్బందులేంటో ప్రధాని మోదీ కి కూడా తెలుసని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ దేశానికి బడే భాయ్ అని చెప్పారు. బడే భాయ్‌గా ప్రధాని అన్ని రాష్ట్రాల అభివృద్ధికి మద్దతివ్వాలని కోరారు. డిసెంబర్ 9న 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రజెంట్ చేస్తామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ పనిచేస్తోందని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణకు కేంద్రం అనుమతులివ్వాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10వ శాతం తెలంగాణ వాటా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు సీఎం వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చే చర్యలు చేపడుతామన్నారు. మూడేళ్లలో నగరంలో ఎలక్ట్రిక్ బస్సులనే నడుపుతామన్నారు. సమావేశంలో వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ : రాష్ట్రంలోని పత్తిరైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ కాటన్ మార్కెట్‌ను మంగళవారం సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈరోజు పత్తి రైతులకు వచ్చిన కష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కారణమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల మీద, రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని విమర్శించారు. పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు కోట్ల లోన్లు ఎగ్గొడితే ఎలాంటి నిబంధనలు లేవు కానీ రైతుల పంట కొనుగోలు చేయడానికి ఇన్ని నిబంధనలు ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. యాప్ రద్దు చేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మరో బస్సు ప్రమాదం..

అక్షరటుడే, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాల పరంపర ఆగడం లేదు. సాధారణ ప్రయాణం కూడా మృత్యుమార్గంగా మారిపోతుండడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాదిలో ఏపీ-తెలంగాణ జాతీయ రహదారుల పై పదుల సంఖ్యలో బస్సు ప్రమాదాలు చోటుచేసుకోవడం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం ప్రధాన కారణాలు అని నిపుణులు చెప్తున్నారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ బైపాస్ అనాసాగరం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కావేరీ ట్రావెల్స్ కు చెందిన ప్రయివేట్ బస్సు లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వచ్చిన మరో లారీని ఢీకొట్టింది. బస్సు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఢీకొట్టిన ప్రభావానికి బస్సు ఎడమ భాగం పూర్తిగా ధ్వంసమైపోయింది. అప్పుడు బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని వెంటనే నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనేక మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బస్సు వేగంగా లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించడంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక సమాచారం. వరుసగా జరుగుతున్న ఇటువంటి ఘటనలు ప్రయివేట్ బస్సుల డ్రైవింగ్ ప్రమాణాలపై, రోడ్డు భద్రత చర్యలపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు అత్యవసర చర్యలు తీసుకోవాలని, డ్రైవర్లపై కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.